సింహాద్రినాథుని దర్శించుకున్న ప్రముఖులు

విశాలాంధ్ర-సింహాచలం : ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామివారిని శనివారం విశాఖనగర మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎంఎల్‌సి మంతెన సూర్యనారాయణ రాజు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర యాదవ్ మారీటైన్ బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్య, అంకుష్ గుప్తా సి.ఏ.ఓ. విశాఖ రైల్వే డివిజనల్, డి..శ్రీనివాసరావు సి.ఈ దర్శించుకున్నారు. వీరికి ప్రోటోకాల్ సహాయకార్య నిర్వహణాధికారి నక్కన ఆనందకుమార్ ఆలయ ధ్వజస్తంభం వద్ద స్వాగతం పలికారు. వేద, నాద మంత్రాలతో ఆలయంలోనికి తీసుకువెళ్లి ముందుగా కప్ప స్తంభం ఆలింగనం, బేడా మండపము ప్రదక్షిణ తదుపరి స్వామివారి దర్శనము అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అనంతరం ప్రోటోకాల్ సహాయ కార్య నిర్వహణ అధికారి స్వామివారి పటము ప్రసాదాలను బహుకరించారు.

సమాచారశాఖ ఉప సంచాలకులుగా డి.రమేష్

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : సమాచార పౌర సంబంధాల శాఖ, విశాఖపట్టణం ఉప సంచాలకులుగా డి.రమేష్ బాధ్యతలు(ఎఫ్.ఎ.సి.) స్వీకరించారు. ఈయన ఇప్పటి వరకు విజయనగరంలో ఏడీగా సేవలందించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో విశాఖపట్టంలోని ఎస్.ఐ.సి. (రాష్ట్ర సమాచార కేంద్రం) ఏడీగా విచ్చేసిన ఆయన విశాఖపట్టణం, సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో ఉప సంచాలకులుగా శుక్రవారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. సంబంధిత పత్రాలపై సంతకాలు చేశారు. ఈసందర్భంగా శనివారం ఉదయం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ లను వారి ఛాంబర్లలో కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. అలాగే సమాచార పౌర సంబంధాల శాఖ, ప్రాంతీయ సంయుక్త సంచాలకులు వి. మణిరామ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. రమేష్ నియామకం పట్ల సమాచార శాఖ ఉద్యోగులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో బాధ్యతలు నిర్వర్తించిన ఎస్.వి. రమణ అనకాపల్లి బదిలీపై వెళ్లారు.

విమాన ప్రమాదంపై మాజీ మంత్రి అవంతి శ్రీనివాసరావు దిగ్భ్రాంతి

విశాలాంధ్ర - తగరపువలస : గుజరాత్ నుంచి లండన్ వెళ్ళే విమానం ప్రమాదవశాత్తు కూలిపోవడం దిగ్భ్రాంతికి గురి చేసిందని చాలా దురదృష్టకరమైన విషయమని అవంతి శ్రీనివాసరావు పత్రికా ముఖంగా తెలిపారు. జరిగిన ప్రమాద ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ వారి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలుపారు. ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు.

మూడో అంతస్తు పైనుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య

విశాలాంధ్ర - తగరపువలస : స్థానిక సంగివలస కె.బి.ఆర్ అపార్ట్మెంట్స్‌లో నివాసం ఉంటున్న సనాని వెంకట్రావు, తండ్రి సత్యం శనివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో అపార్ట్మెంట్ మూడో అంతస్తు నుండి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎన్ఎస్ఆర్ఐటి కాలేజీలో వాచ్మెన్ గా పనిచేస్తున్న ఇతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇతని భార్య సనాని సుగుణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు భీమిలి పోలీసు వారు ఫిర్యాదును నమోదు చేసి దర్యాప్తును మొదలుపెట్టారు. ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది.

షీలానగర్ కాన్వెంట్ రహదారిలో ఘోర రోడ్డు ప్రమాదం

ద్విచక వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరు మృతి

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. కింద పడిన వారిపై నుండి దూసుకుపోయిన లారీ చక్రాల కింద పడి గుర్తుపట్టని విధంగా నుజ్జు నుజ్జయిన తల భాగం దృశ్యాలు స్థానికంగా అందర్నీ తీవ్ర కలత చెందేలా చేశాయి. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుల పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

గీతం ఆసుపత్రి ఆధ్వర్యంలో రక్తదానం

విశాలాంధ్ర-మధురవాడ : ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం అనుబంధాగా గల గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి (జిమ్‌సర్) ఆధ్వర్యంలో శనివారం తేది: 14-06-2025న స్వచ్ఛంద రక్తదాన శిభిరాన్ని నిర్వహించారు. గీతం ఆస్పత్రి రక్త నిధి ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో వైద్య విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు, పారామెడికల్ విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఐఎన్ఎస్ కలింగ నుంచి నేవి అధికారులు పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి (జిమ్‌సర్) ప్రో%-%వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి మాట్లాడుతూ దేశంలో ఏటా 5 కోట్ల యూనిట్‌ల రక్తం అవసరమవుతుండగా దాతల ద్వారా 2.5 కోట్ల యూనిట్‌ల రక్తం మాత్రమే సేకరణ అవుతోందన్నారు. ప్రతి రోజు సుమారు 40 వేల మంది స్వచ్ఛంధ రక్తదానం చేయగలిగితే అత్యవసర పరిస్థితిలో ఉన్న వారికి ప్రాణం నిలప వచ్చునన్నారు. ప్రతి రెండు సెకండ్లకు దేశంలో ఎవరో ఒకరికి రక్తం అవసరం పడుతోందన్నారు. స్వచ్ఛంధ రక్తదానం వల్ల ఒకరి ప్రాణాలను నిలబెట్టడంతో పాటు రక్తదానం చేసిన వారికి తిరిగి కొత్త రక్తం శరీరంలో తయారయ్యి పునరుత్తేజం వస్తుందన్నారు. రక్తదానానికి ముందుకు వచ్చిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లను ఆమె అభినందించారు. కార్యక్రమంలో జిమ్ సర్ బ్లడ్బాంక్ ఇంచార్జి డాక్టర్ అంజు చౌదరీ, జిమ్‌సర్ ఎక్రిడిటేషన్ కోఆర్డినేటర్ డాక్టర్ కృష్ణకార్తీక్‌భోగవల్లి, జిమ్‌సర్ ఆసుపత్రి సూపరెండెంట్ డాక్టర్ వి.వి.నరసింహరావు, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. రమణ రావు,తదితరులు పాల్గొన్నారు.

ఆక్సిజన్ డిఫెన్స్ కాలనీలో పార్కు ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర-పెందుర్తి : జీవీఎంసీ 97వ వార్డు ఆక్సిజన్ డిఫెన్స్ కాలనీలోని ప్రభుత్వ భూమిలో వెంటనే పార్కును నిర్మించి, అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. శనివారం అక్కడ నిర్వహించిన మీడియా సమావేశంలో పిఓడబ్ల్యు రాష్ట్ర అధ్యక్షులు ఎం లక్ష్మి, ఐఎఫ్టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. వెంకటేశ్వర్లు, మురికివాడ నివాసుల సంక్షేమ సంఘం నగర కోకన్వీనర్ టి. రూప, పిఓడబ్ల్యు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్. వెంకటలక్ష్మి, యు. ఇందిర మాట్లాడారు. ఆక్సిజన్ డిఫెన్స్ కాలనీ ప్రజలు చేసిన పోరాట ఫలితంగా సాధించుకున్న హక్కులను ప్రభుత్వ అధికారులు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మరొకసారి ప్రభుత్వ భూముల ఆక్రమణ జరగకుండా చూడాలని కోరారు. ఆక్సిజన్ డిఫెన్స్ కాలనీలో ఆక్రమణలపై గత 11 నెలలుగా తమ పోరాటం సాగుతూ వచ్చిందని 73 రోజులుగా నిరసన దీక్షా శిబిరం నడిచిందని తెలిపారు. తమ పోరాటంపై జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, ఎమ్మార్వో ఆనంద్ కుమార్ స్పందించి కబ్జాకు గురైన భూమిని స్వాధీనం చేసుకుంటామని అక్కడ పార్క్ ఏర్పాటు చేస్తామని తొలగించిన అంబేద్కర్ విగ్రహాన్ని పునఃప్రతిష్ఠిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆ హామీ మేరకు నిరసన దీక్ష శిబిరాన్ని విరమిస్తున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వ స్థలాలు తిరిగి ఆక్రమణకు గురికాకుండా చూడాలని కోరారు. బుర్రా రాజేష్ అనే వ్యక్తి దళిత మహిళపై కులం పేరుతో దూషించి అవమానపరిచినప్పటికీ పోలీసులు కేసులు నమోదు చేయకపోవడాన్ని ప్రజా సంఘాలు ఆక్షేపించాయి ఇప్పటికైనా ప్రభుత్వం కబ్జాదారులను నిరోధించాలని కోరారు.

ప్రపంచ రికార్డు యోగా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి

మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు

విశాలాంధ్ర-పెందుర్తి : ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జరిగే యోగా డే కార్యక్రమాలతో ప్రపంచ రికార్డులు సృష్టించే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, ఈబృహత్తర కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని మాజీ జెడ్పి ఫ్లోర్ లీడర్‌రెడ్డి నారాయణరావు ప్రజలకు పిలుపునిచ్చారు. యోగాంధ్ర-2025 పేరిట నెలరోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమాలు జరుగుతున్నాయని, ఈ కార్యక్రమంలో అందరూ ఉత్సాహంగా పాల్గొనాలని కోరారు. పెందుర్తి మండలం రాంపురం జిల్లా పరిషత్ హై స్కూల్‌లో శనివారం నిర్వహించిన యోగ అవగాహన తరగతులలో ఆయన పాల్గొన్నారు. గ్రామస్తులతో కలిసి యోగాసనాలు వేసిన రెడ్డి నారాయణరావు మాట్లాడుతూ ఈనెల 21న విశాఖలో ఐదు లక్షల మంది ఏకకాలంలో యోగాసనాలు వేయనున్నారని, ఈ కార్యక్రమం ప్రపంచ రికార్డుల్లో శాశ్వతంగా నిలిచిపోనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రసన్నకుమార్, మహిళా పోలీస్ అధికారి మాధురీ, సోషల్ వెల్ఫేర్ గుణసాయి ప్రకాష్, వ్యవసాయ అధికారి గాయత్రి, ఉపాధి హామీ వర్కర్లు, డ్వాక్రా మహిళలు, నాయకులు ఏ.బంగారునాయుడు, డి.శ్రీధర్, ఏ.స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్రలో పారిశ్రామిక సంస్థలు భాగస్వాములు కావాలి

- యోగపై సమాచారం ఇచ్చేందుకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు
- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జూన్ 21వ తేదీన నగరంలో భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోడి గారు పాల్గొనే యోగా కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ సంస్థలు, పారిశ్రామిక సంస్థలు భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. ఆయా సంస్థల నుంచి పెద్ద ఎత్తున ఉద్యోగులు, విద్యా సంస్థల్లోని విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. నగరంలోని కేంద్ర ప్రభుత్వ, పారిశ్రామిక సంస్థల ప్రతినిధులతో యోగాంధ్ర కార్యక్రమంపై జిల్లా కలెక్టర్ శనివారం కలెక్టర్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. తమ సంస్థల తరపున యోగా దినోత్సవంలో ఎందరు, ఏయే ప్రదేశాల్లో పాల్గొంటారనే సమాచారాన్ని జిల్లా యంత్రాంగానికి అందజేయాలని కోరారు. అన్ని కేంద్ర సంస్థలు, పరిశ్రమలు తమ పరిధిలో ఈకార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సహకరించా లన్నారు. తమ సంస్థల ఆవరణల్లో అందుబాటులో ఉన్న ప్రదేశాల్లో యోగ దినోత్సవం నిర్వహిస్తున్నామని పోర్టు ట్రస్టు, స్టీల్ ప్లాంటు, హెచ్.పి.సి.ఎల్., కోరమాండల్, దివీస్, ఐ.ఐ.ఎం., రైల్వే ప్రతినిధులు తెలిపారు. యోగా దినోత్సవంలో పాల్గొనే వారందరికీ టీ షర్టులు, మేట్‌లు జిల్లా యంత్రాంగం తరపున అందజేస్తామని కలెక్టర్ చెప్పారు. యోగ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన వారికి మరుగు దొడ్లు అందుబాటులో వుండేందుకు వీలుగా బీచ్ రోడ్డులో వున్న రెస్టారెంట్‌లు, హొటళ్ల యాజమాన్యాలతో మాట్లాడి ఆరోజుకు ప్రజలు వినియోగించేందుకు అనుమతించేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ వాణిజ్య పన్నులు, ఆహార భద్రత శాఖల అధికారులను ఆదేశించారు. యోగ కార్యక్రమంలో పాల్గొనదలచిన వారికి అవసరమైన సమచారం అందజేసేందుకు సాగరిక కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేస్తున్నామని, దీనిపై సమాచారం కోసం ఈ హెల్ప్ డెస్క్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. 0891-2942015, 2942040, 2942044, 2942055 ల్యాండ్ లైన్ నెంబర్లకు ఫోన్ చేస్తే సమాచారం అందజేస్తారని పేర్కొన్నారు.

శ్రీనివాస సేవా సంఘం ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం

విశాలాంధ్ర-పద్మనాభం : పద్మనాభం మండలం రేవిడి పంచాయతీ పరిధిలో రేవిడి సెంటర్లో ఏర్పాటు చేసిన శ్రీనివాస సేవా సంఘం ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం రెండు నెలలుగా నిరంతరాయంగా దాతల సహాయ సహకారాలతో మజ్జిగ చలివేంద్రం నిర్వహించి శనివారం ముగించడం జరిగినది. శ్రీనివాస యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రతి ఏడాది రేవిడి సెంటర్లో మజ్జిగ చలివేంద్రం కార్యక్రమం జరుగుతుంది. ఈ రేవిడి సెంటర్ కు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ఎంతోమంది రోజు వస్తుంటారు. ఈ ఏడాది కూడా సుమారు 2 నెలల సమయంలో ఎంతోమంది పాదచారులు ,ప్రయాణికులుకు దాహాన్ని తీర్చినందుకు మాకు ఎంతో గర్వంగా ఉంది. ఈ కార్యక్రమం ఇంత ఘనంగా జరగడానికి మాకు ఎంతో మంది సహాయ సహకారాలు అందించిన దాతలు అందరికీ మనస్ఫూర్తిగా ధన్యవాదాలు. మండుటెండలో చెరువు పని నుండి వచ్చిన మహిళలు, వృద్ధులు, ప్రయాణికులు, పాదచారులు అందరికీ ఎంతో ఉపయోగకరమైన కార్యక్రమంగా మేమంతా భావిస్తున్నాము. వారు మండుటెండల్లో వచ్చి ఈ మజ్జిగ చలివేంద్రం దగ్గర దాహం తీర్చుకునేవారు. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా శ్రీనివాస యువజన సేవా సంఘం అధ్యక్షులు కోన సన్యాసినాయుడు, ఉపాధ్యక్షులు పాంద్రంగి సత్యం నాయుడు, కోశాధికారి మజ్జి శంకర్రావు, కార్యదర్శి మంత్రి ప్రగడ పద్మనాభ స్వామి, సహాయ కార్యదర్శి కంది సత్యనారాయణ,సభ్యులు సారికి శంకర్రావు, చీర కనకరాజు, ఒమ్మి పైడి నాయుడు, సంపంగి అప్పలరాజు,రెడ్డి అప్పలనాయుడు, బర్ల మధు, ముద్దాడ శ్రీను. అలాగే ఈ సంఘం యొక్క పూర్వ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు పతివాడ ఇంద్రావు, మరగడ చిరంజీవి పాల్గొనడం జరిగింది. కావున ఈరోజుతో చలివేంద్రం కార్యక్రమం ముగింపు కార్యక్రమం చేపట్టడం జరిగింది.

యోగాంధ్ర 2025కు విస్తృత ప్రచారం

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం వేదికగా 'విశ్వమంతా యోగాతో ఆరోగ్యం' నినాదంతో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని అత్యంత భారీగా నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. యోగాంధ్ర 2025కు విస్తృత ప్రచారం కల్పించడం, భారీ సంఖ్యలో ప్రజలను భాగస్వాములు చేసేందుకు నెల రోజుల కార్యాచరణ ప్రభుత్వం రూపొందించింది. ఇందులో భాగంగా ఈరోజు విశాఖ ఆర్ కె బీచ్‌లో ఆర్ట్ అఫ్ లివింగ్ వారు యోగాంధ్ర క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ క్యాంపెయిన్లో విశాఖ ఈస్ట్ శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ 'యోగా అందరి జీవితాల్లో భాగం కావాలి. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం జరపాలన్న ప్రధాని మోడీ ప్రతిపాదనను 177 దేశాలు ఆమోదించాయి. యోగా వల్ల ఆరోగ్యానికి కలిగే ప్రయోజనాలప విస్తృతంగా అవగాహన కల్పిస్తాం. జూన్ 21న వైజాగ్ నగరంలో 5 లక్షల మందితో యోగా కార్యక్రమంలో ప్రధాని మోడీ, సీఎం చంద్రబాబు పాల్గొంటారు. రాష్ట్ర వ్యాప్తంగా రెండు కోట్ల మంది యోగా ద్వారా ప్రయోజనాలు పొందాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది' అని అన్నారు. ఆర్ట్ అఫ్ లివింగ్ అపెక్స్ సభ్యురాలు యార్లగడ్డ గీతాశ్రీకాంత్ మాట్లాడుతూ పదకొండవ అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజున ఐదు లక్షల మందితో విశాఖ వేదికగా జరగనున్న యోగా కార్యక్రమం లో ఉత్తరాంధ్ర ప్రసజలందరు పాల్గొని గిన్నీస్ రికార్డు సాధించాలని పిలుపునిచ్చారు. రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్ మరియు ఆర్ట్ అఫ్ లివింగ్ అపెక్స్ మెంబెర్ పోలా భాస్కర్ మాట్లాడుతూ నిరంతర యోగా సాధన ప్రతి వర్డ్ స్థాయి లో జరిగే విధంగా కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని చెప్పారు. శ్రీ శ్రీ యోగ స్టేట్ కోఆర్డినేటర్ రాణి ఆధ్వర్యంలో ఆర్ట్ అఫ్ లివింగ్ సభ్యులు, స్పోర్ట్స్ స్టూడెంట్స్, యోగ టీచర్స్ సూర్య నమస్కారాలు, కామన్ యోగ ప్రోటోకాల్ ఆసనాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ ఆర్ డిడి ఝాన్సీ, డిస్‌డి ఒ జూన్, నోడల్ ఆఫీసర్ శైలజ యోగ ఆచార్య రవి కిశోర్, శంకర్నారాయణ, శారదవల్లి తదితరులు పాల్గొన్నారు.

నేడు పలు ప్రారంభోత్సవ కార్యక్రమాలలో పాల్గొనున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

విశాలాంధ్ర-పద్మనాభం : పద్మనాభం మండలంలో వ్యవసాయ శాఖ మండల అధికారి ఏవీఎస్ చలం తెలిపిన వివరాల మేరకు నేడు ఉదయం 9 గంటల 30 నిమిషాలకు స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చేతుల మీదుగా ఏరువాక విత్తన సరఫరా ప్రారంభోత్సవ కార్యక్రమం ప్రారంభించనున్నట్లు తెలియజేశారు. కావున మండలంలోని రైతు సోదరులందరూ ఈ కార్యక్రమానికి హాజరై ఏరువాక విత్తన సరఫరా ప్రారంభ వస్తవ కార్యక్రమంలో భాగస్వాములు అవ్వాలని తెలియజేశారు. స్థానిక ఎంపీడీవో ఎం విజయ కుమార్ తెలియజేసిన వివరాలు ప్రకారం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ లో నూతనంగా నిర్మించిన మండల పరిషత్తు నూతన సమావేశ మందిరము ప్రారంభోత్సవానికి స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హాజరవుతున్నట్లు తెలియజేశారు. కావున మండలములోని సర్పంచులు,ఎంపీటీసీలు, ఇతర ప్రజా ప్రతినిధులు,అన్ని శాఖల అధికారులు మరియు సిబ్బంది హాజరు కాగలరని కోరారు.

గ్రంథాలయాలు మానవ పురోగతికి దోహదపడతాయి

మేధా మధనం చర్చ గోస్టిలో మాజీ విసి, యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పూర్వ సభ్యులు ఆచార్య కె.ఎస్.చలం

విశాలాంధ్ర-విశాఖ సిటీ : గ్రంథాలయాలు విజ్ఞాన సమపార్జనతో పాటు మానవ పురోగతికి దోహదపడతాయని నాగార్జున యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్, యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పూర్వ సభ్యులు ఆచార్య కె.యస్.చలం అన్నారు. శనివారం పౌర గ్రంథాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక మేధా మధనం పేరుతో నిర్వహించిన చర్చ గోష్టి కి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో హిందీ తర్వాత స్థానంలో ఉన్న తెలుగు లో పుస్తకాల ప్రచురణ తగ్గిపోతుందని, పబ్లిషింగ్ సంస్థలు కూడా మూతపడుతున్నాయి అన్నారు. గ్రంథాలయ ఉద్యమంలో ప్రజల భాగస్వామ్యం అవసరం అన్నారు. పుస్తకంతో తనకు గల అనుబంధాన్ని వివరించారు. పుస్తకాలవల్లే తాము ఈ స్థాయికి వచ్చాం అన్నారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలుగులో పుస్తక ముద్రణలు తగ్గి పోయాయన్నారు. కేరళలోని గ్రంథాలయ నిర్వహణా తీరును తెలియజేస్తూ, మన రాష్ట్రంలోని వెనుకబాటు తనాన్ని చెప్పారు. ఇందులో ప్రభుత్వ లోపమే కాదు, మన లోపము కూడా ఉందన్నారు. ప్రభుత్వ మీద ఒత్తిడి తీసుకు వచ్చి ప్రజలను సమాయత్తం చేయవలసిన అవసరం ఉందన్నారు. ప్రజల నుంచి గ్రంథాలయ సెస్ వసూలు చేస్తున్నా లైబ్రరీలకు నిధులు విడుదల చేయట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రంథాలయాలు ప్రస్తుతం ప్రభుత్వ ఆదరణ లేక దీనావస్థలో ఉండడం చేత, విజ్ఞులైన వారు వాటిని చూస్తూ ఉదాసీనతతో విడిచిపెడితే తెలుగు జాతి తన జ్ఞాన దృష్టిని కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక కన్వీనర్ వల్లూరి శివప్రసాద్ మాట్లాడుతూ గ్రంథాలయాలు స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో కీలక పాత్ర పోషించాయన్నారు. ఆసమయంలో ప్రజలను చైతన్య పరచడానికే గ్రంథాలయ ఉద్యమం పుట్టిందన్నారు. 1930 లోనే ఇది ప్రారంభమైందని తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయాల దిశ దశ-ప్రజల కర్తవ్యం అన్న అంశంపై వారివారి అభిప్రాయాలను, సూచనలను, భవిష్యత్తు కార్యాచరణను నిర్దేశించారు. గ్రంథాలయాలు వెనుక బడి ఉండడం వలన సమాజానికి కలిగే నష్టాన్ని వివరించారు. గ్రంథాలయ నిధులు దుర్వినియోగాన్ని ప్రస్తావించారు. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపారు. ప్రభుత్వ బాధ్యతలను గుర్తు చేశారు. విజయవాడలో జరిగిన సమావేశ వివరాలను సభ ముందుంచారు. ఇది తాత్కాలిక ఉద్యమం కాదని నిత్య పోరాటమన్నారు.

మాజీ ఉపకులపతి, ఆంధ్ర రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులు : రొక్కం సుదర్శన్ మాట్లాడుతూ గ్రంథాలయాలు పురోగతికి చిహ్నాలని, మానవ అభివృద్ధికి అవి నాంది పలుకుతాయని అన్నారు. గ్రంథాలయాలు ప్రజల ఆస్తిగా భావించాలన్నారు. వీటిని అభివృద్ధి చేస్తే ప్రజలకు సంక్షేమ కార్యక్రమం చేసినట్లేనని భావించాలన్నారు. ముఖ్యంగా ఆర్థిక వనరులు లేక గ్రంథాలయాల పురోగతి ఆగిపోయింది అన్నారు. పుస్తకాలు కొనే శక్తి లేని వారికి గ్రంథాలయాలు ఎంతో ఉపయోగకరమని వివరించారు. జీవీఎంసీ నుంచి గ్రంథాలయాలకు 117 కోట్లు బకాయి ఉందని తెలిపారు. 2024 -25 సంవత్సరానికి 25 కోట్లు రావాల్సి ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్‌పై ఒత్తిడి తెస్తే ప్రత్యేక గ్రాంట్ గ్రంథాలయులకు విడుదల చేసే అవకాశం ఉందన్నారు. మాజీ విసి, ఆచార్య హెచ్.లజపతిరాయ్ ఉపన్యసిస్తూ గ్రంథాలయాల్లో విద్యార్థులు చదువుకునే విధంగా అలవాటు చేయాలన్నారు. పాఠశాల స్థాయి నుంచే ఇది విధిగా జరగాలని సూచించారు. పిల్లలుచే ఎక్కువగా పుస్తకాలు చదివించాలంటే, తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను సంసిద్ధ పరచవలసి ఉందన్నారు. దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ ఫౌండర్ వైస్ ఛాన్సలర్ ఆచార్య వై.సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యంగా ఉందో తెలియజేయాలన్నారు. గ్రంథాలయ సెస్ గురించి ప్రభుత్వం పై ఒత్తిడి తేవాలన్నారు. చదివే అలవాటు తగ్గి పోయిందని, పుస్తక ప్రాధాన్యతను గుర్తించాలని అభిప్రాయ పడ్డారు. ఏయూ మాజీ విసి ఆచార్య జి. నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఎమ్.వి.యస్.శర్మ మాట్లాడుతూ రీజనల్ లైబ్రరీ దీనావస్థను వివరించారు. యువతను భాగస్వామ్యం చేసి ఉద్యమం నడపాలన్నారు. పుస్తకం ప్రాధాన్యతను చెప్పారు. రైటర్స్ అకాడమీ, ఛైర్మన్ వి.వి.రమణమూర్తి మాట్లాడుతూ విశాఖపట్నం జిల్లా కేంద్ర గ్రంథాలయం స్థలం దురాక్రమణను గురించి వివరించారు. అసెంబ్లీ, ప్రభుత్వ సమావేశాల్లో గ్రంథాలయ ప్రస్తావన ఉండేటట్లు చూడవలసిన అవసరం ఉందన్నారు. ప్రక్క రాష్ట్రాల్లో ఉన్నట్లు మన రాష్ట్రంలో గ్రంథాలయ ప్రగతి లేకపోవడం దురదృష్టకరం అన్నారు. విద్యార్థులకు స్వేచ్ఛలేని కార్పొరేట్ కళాశాలలపై దృష్టి పెట్టాలన్నారు. సీనియర్ జర్నలిస్ట్, సాహితీ వేత్త నల్లి ధర్మారావు గ్రంథాలయ చరిత్రను వివరించారు. ప్రాచీన గ్రంథాలయాలును పరిరక్షించాలని కోరారు. సాహిత్య రంగంలో జరిగిన నష్టాన్ని ప్రస్తావించారు. డా.డి.వి.సూర్యా రావు, విశాఖ పౌర గ్రంథాలయం జాయింట్ సెక్రటరీ డాక్టర్ డి.వి.సూర్యరావు మాట్లాడుతూ గ్రంథాలయాలు పత్రికలను కొనుక్కునే పరిస్థితిలో లేవన్నారు. ప్రభుత్వ పథకాలు ఎందులోనూ గ్రంథాలయం లేదన్నారు. రచయితలు ఉన్నారు కానీ పాఠకులు లేరని, దానిపై దృష్టి పెట్టాలన్నారు. బి.ఎల్.నారాయణ అధ్యక్షులు పౌర గ్రంథాలయ సేవాసమితి మాట్లాడుతూ, జిల్లా గ్రంథాలయ దురాక్రమణ ఘటనను గుర్తు చేశారు. సాహితీవేత్త మేడా మస్తాన్ రెడ్డి, శిరేల సన్యాసిరావు ఎడిటర్ విశాఖ సంస్కృతి మాస పత్రిక కె.నరసింహం ఎడిటర్ సమాజ హిత డైలీ, బద్రి కూర్మారావు జానపద కళాపీఠం, డా.జైపాల్, జయదేవ్ హరి నారాయణ, తదితరులు పాల్గన్నారు.

జూట్ మిల్లు పెన్షన్ సంఘ సమావేశం

విశాలాంధ్ర-తగరపువలస: జూట్ మిల్లు పెన్షన్ సంఘం సమావేశం శనివారం లేబర్ వెల్ఫేర్ సెంటర్లో జరిగినది ఈ సమావేశానికి కానూరు రాంబాబు అధ్యక్షత వహించి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక పెన్షనర్ల బాధను అర్థం చేసుకోకుండా మొండివైఖరి అవలంబిస్తుందని అన్నారు. సమావేశంలో సీనియర్ నాయకులు సింగిడి అప్పారావు మాట్లాడుతూ అనేక వేల కోట్లు మూలధన భవిష్య నిధులు ఉన్నప్పటికీ కూడా కేంద్ర గవర్నమెంట్ కార్మికులకు పెన్షన్ పెంచడానికి నిర్లక్ష్యంగా ఉందని దేశమంతా నిరసనలు తెలియజేస్తున్న కూడా ఈ గవర్నమెంట్‌కి కనికరం కలగలేదని మోడీ గొప్పలు చెప్పుకోవడం తప్ప కార్మికులు పెన్షన్ ఇవ్వాలని జ్ఞానం కూడా లేదని అన్నారు. ఈ సమావేశంలో డి బాబాజీ మాట్లాడుతూ ఈ కేంద్ర గవర్నమెంట కార్మిక ఉద్యోగస్తుల పెన్షన్లు పెంచడానికి దేశవ్యాప్తంగా నిరసన చేసినప్పటికీ ఇప్పుడు ధరలకు అనుగుణంగా కనీసం 7500కు పెంచవలసిన అవసరం ఎంతైనా ఉందని కమిటీలతో కాలియాపన చేస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో మారా అప్పలరాజు మాట్లాడుతూ ఈనెల 17వ తారీఖున మంగళవారం విశాఖపట్నం ఎన్ఏడి ఏరియాలో జిల్లా పెన్షనర్ల సంఘం ప్రాంతీయ సదస్సు జరుగుతున్నదని ఆసదస్సుకు పెన్షనర్లు అందరూ వచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ సదస్సుకు చిట్టివలస జూట్ మిల్ పెన్షనర్లు కూడా పాల్గొని సదస్సును జయప్రదం చేయాలని తెలియజేసినారు.

రూ. 3.5కోట్లతో దక్షిణ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని, అదే లక్ష్యంతో విశాఖ నగరాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు అన్ని వార్డులలో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరుగుచున్నదని విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం ఆయన జీవీఎంసీ పరిధిలోని దక్షిణ నియోజకవర్గంలో సుమారు రూ. 3.58 కోట్ల జీవీఎంసీ నిధులను వెచ్చించి పలు అభివృద్ధి పనులకు దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు సిహెచ్. వంశీకృష్ణ శ్రీనివాస్‌తో కలిసి శంకుస్థాపనలను, ప్రారంభోత్సవాలను చేశారు. ఈసందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వం లోని కూటమి ప్రభుత్వం విశాఖ నగరాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు నగరంలోగల అన్నివార్డులలో ప్రజలకు అవసరమగు మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పనులను ప్రజలకు కల్పించేందుకు జీవీఎంసీ ప్రణాళికలను సిద్ధం చేసిందన్నారు. నేడు దక్షిణ నియోజకవర్గం పరిధిలోని 31, 33, 34, 36, 37, 38 వార్డులలోని గొల్లలపాలెం, చాకలిగెడ్డ, బొమ్మన బ్యాక్ సైడ్, గంగుల గెడ్డ, భూపేష్ నగర్, నాయుడమ్మ ఫంక్షన్ హాల్ రోడ్డు, అల్లిపురం ఎస్సీ కాలనీ రోడ్, బౌడరా రోడ్డు కొబ్బరి తోట,మంతా వారి వీధి మార్కెట్ మెయిన్ రోడ్, రంగిరీజు వీధి, సున్నపు వీధి పంజా జంక్షన్, కనకమహాలక్ష్మి టెంపుల్ గోసాల ఆసుపత్రి, కొత్త అగ్రహారం, కొత్త జాలారిపేట, గొల్ల వీధి తదితర ప్రాంతాలలో రూ. 357.08 లక్షల హెచ్చించి రోడ్లు, సిమెంట్ రోడ్లు,కాలువలు, సామాజిక భవనాల నిర్మాణాలు, మరమ్మతులు, బోర్లు, పార్కుల పునరుద్ధరణ, కాంపౌండ్ వాల్స్, ఆర్చ్‌లు తదితర అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడం జరిగిందన్నారు. శంకుస్థాపన చేసిన పనులను వెంటనే ప్రారంభించి సంబంధిత గుత్తేదారులు నిర్ణీత సమయంలో నాణ్యతతో కూడిన పనులను పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులను మేయర్ ఆదేశించారు. అనంతరం దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు మాట్లాడుతూ దక్షిణ నియోజకవర్గంలోని ప్రతి వార్డులో ప్రజలకు అవసరమయ్యే మౌలిక వసతులను గుర్తించి అభివృద్ధి చేస్తున్నామని, దక్షిణ నియోజకవర్గంలో అన్ని వార్డులను అభివృద్ధి చేసేందుకు గాను ఈరోజు పలు అభివృద్ధి పనులను మంజూరు చేసి ప్రారంభోత్సవాలను శంకుస్థాపనను చేసిన నగర మేయర్ కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం విశాఖ అభివృద్ధికి కంకణం కట్టుకుందని, విశాఖ జిల్లాను దేశంలోనే గుర్తింపు పొందే విధంగా తీర్చిదిద్దేందుకు, ప్రతి ఒక్కరికి సంక్షేమంతో పాటు మౌలిక వసతులను కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం, మహావి విశాఖ నగరపాలక సంస్థ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ జనసేన పార్టీ ఫ్లోర్ లీడర్ భీశెట్టి వసంతలక్ష్మి ,ఆయా వార్డు కార్పొరేటర్లు, బిపిన్ జైన్‌కుమార్ జైన్, ఎం.మేరీ జోన్స్, చెన్న జానకిరామ్, గోడే విజయలక్ష్మి, జీవీఎంసీ 4వ జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు కార్యనిర్వహక ఇంజనీరు యు.ఎస్.నరసింగరావు, ఉప కార్యనిర్వాహక ఇంజనీరు వెంకటేశ్వర రావు, ఏఎంఓహెచ్ పలువురు కార్యకర్తలు ,నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

వెంకటాద్రిపై శ్రీనివాసునికి తోమాల సేవ

విశాలాంధ్ర-పెందుర్తి : ఉత్తరాంధ్ర తిరుపతిగా విరాజిల్లుతున్న పెందుర్తి వెంకటాద్రిపై శనివారం స్వామివారికి సుప్రభాత సేవ, తోమాల సేవ ఘనంగా జరిపించారు. ఆలయ అర్చకులు మహర్తి శ్రీనివాసా చార్యులు ఆధ్వర్యంలో పండితులు తెల్లవారు జామునే స్వామిని మేల్కొల్పి సహస్ర నామార్చన, అష్టోత్తరం, దూపసేవ, దీపోస్తవం నిర్వహించారు. స్వామి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరు కాగా అందరికీ ఉచిత ప్రసాద వితరణ చేసారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశామని ఆలయ అర్చకులు మహర్తి శ్రీనివాసా చార్యులు తెలిపారు. కొండ దిగువ నుండి స్వామి సన్నిధి వరకు ఉచిత వాహన సదుపాయం కల్పించినట్లు తెలియజేశారు.

ఘనంగా షిరిడి సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

విశాలాంధ్ర-పెందుర్తి : జీవీఎంసీ 97వ వార్డు చినముసిడివాడ పరిధిలోగల సాయి నగర్ కాలనీలోని సద్గురు శ్రీ షిరిడి సాయిబాబా టెంపుల్ వార్షికోత్సవం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం నుండి వందలాధిమంది భక్తులు సాయిబాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. స్థానిక కార్పొరేటర్ సేనాపతి వసంత శంకర్రావు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సేనాపతి శంకరరావు తదితర ప్రముఖులు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమాన్ని కార్పొరేటర్ వసంత శంకర్రావు చేతులమీదుగా ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ నాయకులు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

బిజెపి రాష్ట్ర కార్యదర్శి సురేంద్రమోహన్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-పెందుర్తి : భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యదర్శి కేతినేని సురేంద్రమోహన్ జన్మదిన వేడుకలు యువ మోర్చా బొడ్డు గురునాథ్, ఏ.శ్రీకాంత్ ఆధ్వర్యంలో జీవీఎంసీ 95వ వార్డు ఆర్కే ఫంక్షన్ హాల్లో ఘనంగా జరిగాయి, వేద పండితులచే వేద ఆశీర్వాదంతో బిజెపి నాయకులు, కార్యకర్తలు నాయకులు కేతినేని సురేంద్రమోహన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియ జేశారు. బిజెపి నాయకులు కార్యకర్తలు నడుమ సురేంద్రమోహన్ కేక్ కట్ చేసి అందరికీ తినిపించారు. ఈ కార్యక్రమంలో బిజెపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, పెందుర్తి బిజెపి నాయకులు జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, బిజెపి 95, 97 వార్డుల అధ్యక్షులు చిక్కాల సతీష్ సురేంద్రమోహన్‌ను శాలువాతో సత్కరించి,పూల మొక్క పుష్పగుచ్చం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన, బాణాసంచా కాల్పులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో టిడిపి పెందుర్తి యువ నాయకులు గండి వంశీ దీప్, బిజెపి సోషల్ మీడియా కన్వీనర్ కంచిబోయిన వెంకట సంతోష్, రాపర్తి దుర్గాప్రసాద్, కొత్తపల్లి అప్పలరాజు, బొబ్బర నాగరాజు, గౌరి కుమారి, మాధవి, భవాని, కెవిఆర్.లక్ష్మి, లావణ్య కూటమి నాయకులు, కార్యకర్తలు, పెద్దఎత్తున పాల్గొన్నారు.

అర్హుల విద్యకు ఆటంకం ఉండదు

పిట్ట సురేష్

విశాలాంధ్ర-తగరపువలస : తల్లికి వందనం అనర్హుల జాబితాలో అర్హత కలిగిన నిజమైన లబ్ధిదారులకు అనర్హులుగా గుర్తించారని విద్యార్థుల తల్లులు ఆందోళన చెందవద్దని టీడీపి నాయకులు పిట్ట సురేష్ అన్నారు. తల్లికి వందనం పథకానికి దరఖాస్తు చేసుకున్న వారి కుటుంబంలో ప్రభుత్వఉద్యోగం కలిగిన వాళ్ళు, ఆదాయ పన్ను కడుతున్న వాళ్ళు, 3 ఎకరాల కన్నా ఎక్కువ సాగు భూమి కలిగిన వాళ్ళు,4 వీలర్స్ కలిగిన వాళ్ళు,1000 చదరపు అడుగుల కంటే ఎక్కువ విస్తీర్ణం గల ఇల్లు ఉన్నవారు, విద్యుత్ వినియోగం నెలకు సరాసరి 300 యూనిట్లు కంటే ఎక్కువ చేస్తున్న వాళ్ళు వున్న కారణంగా అనర్హులుగా పరిగణించబడ్డారు. పై కారణాలలో ప్రభుత్వ రికార్డుల్లో తప్పుగా నమోదు జరిగినట్లయితే సువరించబడిన ధ్రువ పత్రాలతో మీ సచివాలయంలో గ్రీవెన్స్ గా ఈనెల 20వ తారీకు వరకు స్వీకరించబడతాయి. గ్రీవెన్స్ వెరిఫికేషన్, సప్లిమెంటరీ జాబితా ఈనెల 28వ తారీకు వరకు జరిగి 30వ తారీఖున మీమీ సచివాలయంలో ప్రదర్శించబడతాయి. అర్హులైన లబ్ధిదారులకు జూలై 5వ తారీఖు నాటికి జమ చేయబడతాయి. నిజమైన అర్హులు ఎవ్వరూ ఆందోళన చెందవద్దని తెలియజేసారు.

ఉక్కు పరిరక్షణకు రక్తదానం!

విశాలాంధ్ర-గాజువాక : మానవుని జీవనానికి రక్తం ఎంత ప్రధానమో ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధికి విశాఖ స్టీల్ రక్షణ అంతే ప్రధానమని ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ డి రాధాకృష్ణన్ అన్నారు. శనివారం ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా స్టీల్ సిఐటియు ఆధ్వర్యంలో ఉక్కునగరం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కళాక్షేత్రంలో (సి డబ్ల్యూ సి -1) లో రెడ్ క్రాస్, లైన్స్ క్లబ్, లైఫ్ లైన్ రక్తనిధి సంస్థల సహకారంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రక్తదాతలకు జ్ఞాపికలను, ప్రశంసా పత్రాలను ముఖ్య అతిథులు మరియు అతిథులు వారికి అందజేశారు. ఈ శిబిరంలో 60 సార్లు రక్తదానం చేసిన సాగర్, 25వ సారీ రక్తదానం చేసిన సాహూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఉద్దేశించి డాక్టర్ డి రాధాకృష్ణన్ మాట్లాడుతూ రక్తదానం చేయడం పై ప్రజల్లో అనేక అపోహలు ఉన్నాయని వాటిని దూరం చేయడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆ పనిని స్టీల్ సిఐటియు గడచిన ఏడు సంవత్సరాలుగా చేస్తూ రక్తదాన శిబిరాలను నిర్వహించడం ముదావహమని ఆయన అన్నారు. రక్తదానం చేయడం వల్ల ఎటువంటి ఆరోగ్య సమస్యలు రావని ఆయన వివరించారు. అలాగే స్టీల్ ప్లాంట్ కు సొంత గనులు కేటాయించడం, స్టీల్ ప్లాంట్ ను రక్షించడం ద్వారా అనేక వేల మంది నిరుద్యోగులకు ఉపాధి కలుగుతుందని ఆయన అన్నారు. ఇటువంటి మంచి పనిలో నన్ను భాగస్వామ్యం చేసిన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలియజేశారు. రక్తదానం చేయడానికి యువత ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. అతిథులు డాక్టర్ వై ఎల్ నరసింహారావు, విశాఖ స్టీల్ జనరల్ హాస్పిటల్ విభాగాధిపతి డాక్టర్ సారంగి మాట్లాడుతూ రక్తదానం ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయని వారు అన్నారు. ఈ రక్తం ముగ్గురు ప్రాణాలను కాపాడుతుందని వారు వివరించారు. రక్తదానం అన్ని దానాల్లో కంటే అత్యంత ముఖ్యమైనదని వారు అన్నారు. రక్తదానం చేయడంపై ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు ప్రజల్లో చైతన్యం కలిగించడం లో స్టీల్ సిఐటియు వారిని ఆదర్శంగా తీసుకోవాలని వారు అన్నారు. శిబిరానికి విచ్చేసిన రక్తదాతలను వారు అభినందించారు. స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె అయోధ్యరామ్ మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ కు గనులు ఎంత ముఖ్యమో మనిషికి కూడా రక్తం అంత ముఖ్యమని ఆయన అన్నారు. గనుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడం ఈ శిబిరం నిర్వహణకు ప్రధాన కారణమని ఆయన అన్నారు. అలాగే నేడు కేంద్రం ప్రభుత్వం దీనిని రక్షించి ప్రభుత్వ రంగంగానే భావితరాలకు అందించాలన్న ప్రధాన ఆశయంతోనే ఈ శిబిరాన్ని ఈ సంవత్సరం నిర్వహిస్తున్నామని ఆయన వివరించారు. కనుక ఆ దిశగా ప్రభుత్వం ఆలోచించి చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. శిబిరం నిర్వాహకులు బి అప్పారావు మాట్లాడుతూ గడచిన ఏడు సంవత్సరాలుగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నామని ఆయన అన్నారు. మొదటి సంవత్సరమే అత్యధిక రక్తం ఒకే చోటు నుంచి సేకరించిన గవర్నర్ అవార్డును సొంతం చేసుకున్నామని ఆయన గుర్తు చేశారు. ప్రపంచ అంతా కోవిడ్ మహమ్మారితో సతమతమవుతున్న సమయంలో కూడా రక్తదాన శిబిరాన్ని నిర్వహించి రక్తాన్ని అవసరమైన వారికి అందించామని ఆయన వివరించారు. ఈ మహోన్నత కార్యక్రమంలో స్టీల్ కార్మిక వర్గం మరియు కుటుంబ సభ్యులు పాల్గొని మమ్మలను ముందుకు నడిపిస్తున్నారని వారందరికీ ప్రత్యేకమైన ధన్యవాదాలు ఆయన తెలియజేశారు. ఇటువంటి సామాజిక కార్యక్రమాల్లో స్టీల్ ప్లాంట్ ఆదర్శంగా నిలిచిందని ఆయన అన్నారు. ఈరోజు జరిగిన రక్తదాన శిబిరంలో 152 యూనిట్ల రక్తాన్ని సేకరించామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సిఐటియు నాయకులు ఎం రామారావు, స్టీల్ సిఐటియు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వైటి దాస్, యు రామస్వామి, స్టీల్ సిఐటియు నాయకులు యు వెంకటేశ్వర్లు, కె గంగాధర్, టి వి కె రాజు, పుల్లారావు, మరిడయ్య, పి శ్రీనివాసరాజు, డి కృష్ణమూర్తి, వి మురళి, సిహెచ్ అరుణ్, డి ఎస్ వి ఎస్ శ్రీనివాస్, శ్రీరామచంద్రమూర్తి, ఏ శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, దుర్గాప్రసాద్, అప్పలరాజు, లోకేష్, కర్రీ శ్రీనివాస్, మహేష్, డి ఎస్ ఆర్ సి మూర్తి, భానుమూర్తి తదితరులతో పాటు వివిధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు స్టీల్ కుటుంబ సభ్యులు, రక్తనిధుల ప్రతినిధులు మరియు అధిక సంఖ్యలో రక్తదాతలు పాల్గొన్నారు.

పల్లా సింహాచలం వర్ధంతి సభ

విశాలాంధ్ర-పెదగంట్యాడ : శనివారం విశ్రాంతి ఉద్యోగులు పెదగంట్యాడ మండలం ఆపరా సంగం ఆధ్వర్యంలో సీతానగరం ఎన్టీఆర్ జంక్షన్ వద్ద స్వర్గీయ పల్లా సింహాచలం వర్ధంతి సభ జరిగింది. ఈ సభకు కనితి అప్పలరాజు అధ్యక్షత వహించారు. ఈ సభకు ముఖ్యులు టిడిపి జిల్లా నాయకులు 75 వ వార్డు కార్పొరేటర్ పులి రమణారెడ్డి లక్ష్మీబాయి మాట్లాడుతూ సింహాసనం హిందుస్థాన్ సిపిఎడ్ ఉద్యోగం చేస్తూ కార్మిక వర్గానికి సామాజిక ప్రజలకు ఎన్నో సేవలు అందించారు. అయినా ఈ ప్రాంతంలో నిర్వాసితుల పోరాటాల్లో కూడా నిజాయితీగా పని చేశారు. ఇండిపెండెంట్ ఎమ్మెల్యేగా పోటీ చేసి టూ టౌన్ ఎమ్మెల్యేగా ప్రజలకి సేవలు అందించారు. పల్లా సింహాచలం లేని లోటు ప్రజలకి కుటుంబానికి తీరనిలోటు. పల్లా సింహాచలం కుటుంబానికి మనోధైర్యాన్ని ఇవ్వాల్సిందిగా భగవంతుని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆపరా సంఘం అధ్యక్షులు కిల్లా దీనభందు అన్నారు. కిల్లా దీనభందు మాట్లాడుతూ సింహాచలం ఈ ప్రాంత ప్రజలందరికీ మరవలేని సేవలందించారని, ఈయనకు మనమందరం ఘనమైన నివాళులర్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గుందేసి సత్య రావు, మంత్రి గోపినాథ్‌వి, ఐటీ సి మెస్సేన్ రావు, నమ్మి అప్పలనాయుడు, నమ్మి అప్పారావు, ములగల్ల, పిల్లి పెంటారావు, మేడిశెట్టి వెంకటరావు, నర్సింగరావు, సి సెట్టి అప్పారావు, నక్క అప్పారావు, కన్నబాబు, ముల్లి రమణ, శెట్టి చిన్న తదితరులు పాల్గొన్నారు.

శ్రీదేవి భూదేవి సమేత వైకుంఠ వెంకటేశ్వరస్వామి ఆలయంలో అన్న ప్రసాదం వితరణ

విశాలాంధ్ర-పెదగంట్యాడ : జీవీఎంసీ 65వ వార్డు వాంబే కాలనీలో గరుడాద్రి కొండపై వెలసిన శ్రీదేవి భూదేవి సమేత వైకుంఠ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆలయ ధర్మకర్త మంత్రి మంజుల, ఆలయ చైర్మన్ దొడ్డి రమణ నేతృత్వంలో ప్రతి వారం నిర్వహించే అన్న ప్రసాదం వితరణ జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ వ్యాపారవేత్త కాతా బాలకృష్ణ హాజరయ్యారు. వేపగుంట వాస్తవ్యులుపి. సూర్యరత్నం, సింహాచలం, భడదకుసల్ వంశీ వారి ఆర్థిక సహాయంతో అన్న ప్రసాదం వితరణ నిర్వహించారు. తుంపాల తాతారావు జ్ఞాపకార్థం వారి కుమారులు మధు ప్రసన్న దంపతులు ఆలయానికి విద్యుత్ సరఫరా అంతరాయం రాకుండా ఇంవేటర్ను బహుకరించారు.ముఖ్య అతిథులు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర గాజువాక నియోజకవర్గంలో ఉత్తర ద్వారంలో వెలసిన వైకుంఠ వెంకటేశ్వరస్వామి ఆలయం ఇది ఒక్కటే స్వామివారిని ఏడు వారాలు దీక్షపుని స్వామి వారిని నిష్టగా పూజలు చేసే దీక్ష విరమించుకొని మనసులో కోరికలు ఏమైతే ఉన్నవా స్వామి వారికి చెప్పుకుంటే కోరిన కోరికలు తీరుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. ఆలయ అర్చకులు తాతాచార్యులు, మణికుమార్ ఆచార్యులు పర్యవేక్షణలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెంటకోటరాజు, కొవిరి జానకి, సావిత్రమ్మ, రామలక్ష్మి, సావిత్రి, హిమజా, స్వాతి, జి.పద్మ, చిన్నమ్మల్లు, కాంతమ్మ, గౌరీ, సావిత్రి, శ్రవణ్, సత్యవతి, లక్ష్మమ్మ, ఈశ్వరమ్మ, మంగమ్మ, బావనమ్మ, సంతు, చాముండేశ్వరి మరియు ఆలయ కమిటీ సభ్యులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గొర్లె రామునాయుడు ఆధ్వర్యంలో కేతినేని జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-పెందుర్తి : భారతీయ జనతా పార్టీ పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ గొర్లె రామునాయుడు ఆధ్వర్యంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కేతినేని సురేంద్రమోహన్ జన్మదిన వేడుకలు పెందుర్తి తాండ్రపాపారాయ కళ్యాణమండపంలో ఘనంగా జరిగాయి. బిజెపి అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, విశాఖ జిల్లా కార్యదర్శి నాదెళ్ల జ్యోతి, స్థానిక ఎన్డీఏ నాయకులు బైలపూడి హరగోపాల్, భూపతి అప్పారావు, గొర్లె రామునాయుడు సహా పలువురు నాయకులు, కార్యకర్తలు కేతినేని సురేంద్రమోహన్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో సురేంద్రమోహన్ కేకు కత్తిరించగా నాయకులు కార్యకర్తలు ఆయనకు అభిమానంగా తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా నేతలు మాట్లాడుతూ సురేంద్రమోహన్ ఉమ్మడి విశాఖ జిల్లా బిజెపి పార్టీ అభివృద్ధికి ఎంతగానో పాటుపడుతున్నారని పార్టీ నాయకులకు కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు.

అమెజాన్ డాట్ ఇన్ లో వేసవి షాపింగ్

విశాలాంధ్ర-విశాఖపట్నం : ఈ వేసవిలో చల్లగా ఉండటానికి అమెజాన్.ఇన్ ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. ఎల్ జీ, క్యారియర్, హిటాచీ, సామ్సంగ్, హాయర్ వంటి ప్రముఖ బ్రాండ్ల ఏసీలు మరియు ఫ్రిజ్లపై ఆకర్షణీయమైన డిస్కౌంట్లు, ఈఎంఐ సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. ఏసీలపై ప్రత్యేక అఫర్లు అందుబాటులోకి తీసుకువచ్చారు. రిఫ్రిజిరేటర్ మీద కూడా ప్రత్యేక రాయితీలను తీసుకువచ్చారు. హెచ్డిఎఫ్ సీ, యాక్సిస్, ఎస్బిఐ, హెచ్ఎస్ బీసీ క్రెడిట్ కార్డులతో రూ. 20,000 వరకు డిస్కౌంట్ లభిస్తుంది అన్నారు. 18 నెలల ఈ ఎంఐ అమెజాన్‌పే వినియోగదారులకు 5శాతం క్యాష్ బ్యాక్‌లిలి కూడా లభిస్తుంది. ప్రైమ్ మెంబర్షిప్ ద్వారా రూ. 1,499/సంవత్సరం చెల్లించి ఫాస్ట్ డెలివరీ, ప్రత్యేక డిస్కౌంట్లను పొందవచ్చు. ఈ ఆఫర్ల కోసం అమెజాన్ డాట్ ఇన్ లో సంప్రదించవచ్చు.

బ్రిటీష్ కౌన్సిల్ గ్యాలరీలో సోనాక్షి "జాత్" ప్రదర్శన

విశాలాంధ్ర-విశాఖపట్నం : కస్తూర్బా గాంధీ మార్గ్ బ్రిటీష్ కౌన్సిల్‌లోని ది గ్యాలరీలో, "జాత్" పేరిట సోనాక్షి రూపొందించిన శక్తిపంతమైన శిల్ప కళా ప్రదర్శన నిర్వహించబడుతోంది. కుటుంబ వారసత్వం, లోహం, అంతరార్థాల ద్వారా తరతరాలుగా వస్తున్న మహిళల కథనాలను ఇది ఆవిష్కరిస్తుంది. స్టడీ యూకే: క్రియేటివ్ కనెక్షన్స్ లో భాగంగా 2025 జూన్ 11 నుంచి జూలై 31 వరకు ఈ ఎగ్జిబిషన్ కొనసాగుతుంది. ఆగ్రాలో జన్మించి, ప్రస్తుతం లండన్‌లో స్థిరపడిన సోనాక్షి చతుర్వేదికి పెయింటింగ్, ఎనామెలింగ్, జెమాలజీలో అత్యుత్తమ నైపుణ్యాలు ఉన్నాయి. వీటన్నింటి మేళవించి, మహిళల చరిత్రలు ఏ విధంగా గుర్తుంచుకోబడ్డాయి %-% లేదా వ్యవస్థాగతంగా వారి గురుతులు ఏ విధంగా చెరిపివేయబడ్డాయనేది ఆమె ఈ ప్రదర్శన ద్వారా ఆవిష్కరిస్తున్నారు. వధువుగా, తల్లిగా, అమ్మమ్మగా వంశపారంపర్యంగా మహిళలు పోషిస్తున్న పాత్రలను ప్రశ్నిస్తూ భారత ఉపఖండంలోని హస్తకళా సంప్రదాయాల్లో దాగి ఉన్న ఆకాంక్షలను వెలికితీసేదిగా ఈ ఎగ్జిబిషన్ తీర్చిదిద్దబడింది.

సమకాలీన కళలో ఓ కొత్త స్వరం : సోనాక్షి ప్రతిష్టాత్మకమైన రాయల్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్‌లో జ్యూయలరీ %డ%మెటల్‌లో ఎంఏ (2024) చేశారు. సంప్రదాయ కళలు మరియు సమకాలీన కళలకు మధ్య వారధిగా నిల్చే కొత్త తరం కళాకారులకు ఆమె ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గ్రాడ్యుయేట్ జెమాలజిస్ట్‌గా మరియు ఇందిరాగాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ది ఆర్ట్స్ (సాంస్కృతిక శాఖ) పరిశోధకురాలిగా ఆమెకు విశిష్టమైన నేపథ్యం ఉంది.

ఆల్‌ఇన్ వన్ ఇన్వెస్ట్‌మెంట్ యాప్‌ను ఆవిష్కరించిన టాటా అసెట్ మేనేజ్‌మెంట్

విశాలాంధ్ర-విశాఖపట్నం : యూజర్లు తమ ఆర్థిక ప్రపంచ సమగ్ర ముఖచిత్రాన్ని ఒకే చోట చూసుకునే వీలు కల్పించే లక్ష్యంతో టాటా అసెట్ మేనేజ్‌మెంట్ సరికొత్త యాప్‌ను ఆవిష్కరించింది. ఈ తరహా యాప్‌లలో ఇదే మొట్టమొదటిది. ఏకీకృత డిజిటల్ ప్లాట్‌ఫాంగా తీర్చిదిద్దిన ఈ యాప్ సరళంగా, స్మార్ట్‌గా, వ్యక్తిగతీకరించుకునే విధంగా ఉంటుంది. "వన్ యాప్. వన్ వ్యూ. ఇన్ఫినిట్ ఆపర్చూనిటీస్" అనే బ్రాండ్ ప్లాట్‌ఫాం కింద ఇది రూపొందించబడింది. పెట్టుబడుల ప్రక్రియను మరింత సరళంగా, స్మార్ట్‌గా, అందరికీ అందుబాటులో ఉండేలా తీర్చిదిద్దే దిశగా ఈ మొబైల్ యాప్ ఆవిష్కరణ ఒక కీలక ముందడుగులాంటిది. బ్రాండ్ ఇచ్చే "వన్‌యాప్.వన్‌వ్యూ.ఇన్ఫినిట్ ఆపర్చూనిటీస్" హామీతో, నేర్చుకోవడం, పెట్టుబడులు పెట్టడం నుంచి తమ ఆర్థిక లక్ష్యాలన్నింటినీ ఒకే చోట ట్రాక్ చేసుకునే వరకు ఇన్వెస్టర్లకు అవసరమైనవన్నీ ఈ యాప్ అందిస్తుంది. తమ బ్రాండ్ హామీకి అనుగుణంగా కొత్తగా ఆవిష్కరించిన యాప్ అనేది టాటా అసెట్ మేనేజ్‌మెంట్ డిజిటల్ పరివర్తనలో కీలక మైలురాయిగా నిలుస్తుంది. ఈ ఏడాది తొలినాళ్లలో ఆవిష్కరించిన సరికొత్త లోగో, బ్రాండ్ ఐడెంటిటీకి ఇది కొనసాగింపుగా ఉంటుంది. ఎప్పటికప్పుడు మారిపోతున్న డిజిటల్ ప్రపంచంలో నేటి ఇన్వెస్టర్ల అవసరాలకు అనుగుణంగా సేవలందించాలన్న కంపెనీ నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తుంది. లక్ష్యాలను నిర్దేశించుకునేందుకు, ట్రాక్ చేసుకునేందుకు ఈ యాప్‌లో ఫైనాన్షియల్ రోడ్‌మ్యాప్ మ్యుచువల్ ఫండ్స్, ఈక్విటీ, బ్యాంక్ ఖాతాలను ఒకే చోట చూసుకునేందుకు పోర్ట్‌పోలియో360 త్వరితగతిన రిటైర్మెంట్ ప్లానింగ్ కోసం ఫైర్ కాల్క్యులేటర్ పెట్టుబడుల ఎంపికలను సేవ్ చేసుకునేందుకు, పెట్టుబడుల ప్రక్రియను సరళంగా, సురక్షితంగా మార్చేందుకు స్మార్ట్ కార్ట్ లాంటి ఫీచర్లు ఉన్నాయి.

మండలంలో 144 వేదికలలో నిర్వహణ...

యోగాంధ్ర కార్యక్రమానికి విశేష స్పందన



విశాలాంధ్ర-అనందపురం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కార్యక్రమం యోగాంధ్ర ఈనెల 21న జరగనున్న అంతర్జాతీయ యోగాంధ్ర కార్యక్రమం కు సంబంధించిన ఆనందపురం మండలం లోగల అన్ని సచివాలయ పరిధిలో మొత్తంగా 144 వేదికలు గుర్తించామని, శనివారం ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు ఒక్కొక్క వేదికలో సుమారు 100 మందితో ముందుగానే యోగాకు సంబంధించి మెలకువలు నేర్పించి సన్నద్ధత చేశారు. అంతర్జాతీయ యోగా డే లో పాల్గొన్నందుకు అందర్నీ సన్నద్ధం చేసే విధంగా ఈ మాస్ డిమాన్‌స్టేషన్ నిర్వహించారు. జియో ఫెన్సింగ్ ద్వారా దేశం మొత్తం వీక్షించే విధంగా ఈ యోగ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు.ఈ కార్యక్రమానికి మండల ఎంపీడీవో జానకి, డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ,సచివాలయ పరిధిలో ఉన్న ప్రజలు ప్రతినిధులు పంచాయతీ కార్యదర్శులు పలువురు పాల్గొన్నారు.